క్లుప్తంగా

షూటింగ్ పోటీల విజేతను అభినందించిన ఎంపీ

ఖమ్మంమయూరిసెంటర్: వరల్డ్ షూటింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో బంగారు పతకం సాధించిన సాదుల మేఘన, ఆమె తల్లిదండ్రులు శ్రీలత, సారంగపాణి(ఏసీపీ)ని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అభినందించారు. జర్మనీలో జరిగిన పోటీల్లో మేఘన విశేష ప్రతిభ కనబర్చడం అభినందనీయమని కొనియాడారు. భవిష్యత్‌లో ఆమె మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

స్వాతంత్య్ర సమరయోధుడు మృతి


వీరారావు(ఫైల్)

ఖమ్మంమయూరిసెంటర్: స్వాతంత్య్ర సమర యోధుడు, కమ్యూనిస్ట్ సీనియర్ నాయకుడు వీరారావు (93) బుధవారం నగరంలోని 25వ డివిజన్ అద్దంకి వీధి నివాసంలో అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన మృతి పట్ల సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సీపీఎం నాయకులు యర్రా శ్రీకాంత్, వై.విక్రమ్, యర్రా శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్, కాంగ్రెస్ నాయకుల వడ్డెబోయిన నర్సింహారావు తదితరులు ఆయన నివాసంలో భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించి సంతాపం వ్యక్తం చేశారు.

దివ్యాంగురాలికి న్యాయం చేయాలి

నేలకొండపల్లి: దివ్యాంగురాలు గాయత్రికి న్యాయం చేయాలని తెలంగాణ దివ్యాంగుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు పసుపులేటి వెంకట చలమయ్య డిమాండ్ చేశారు. బుధవారం ఈమేరకు స్థానిక ఎస్సైకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని మంగాపురానికి చెందిన దివ్యాంగురాలు గాయత్రని భర్త, అతని కుటుంబ సభ్యుల వేదింపులకు గురి చేస్తున్నందున దివ్యాంగుల హక్కుల చట్టం అమలు చేసి ఆమెను రక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు చిర్రా భిక్షం, జిల్లపల్లి వెంకటేశ్వర్లు, కృష్ణ, రామకృష్ణ, వీరన్న, బాలయ్య, లక్ష్మి, వెంకయ్య, శ్రీను, శ్రీనివాస్, చందు తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న సంస్థ బాధ్యులు

కూసుమంచి: చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీం ఆధ్వర్యాన బుధవారం కూసుమంచిలో సంపూర్ణ సురక్ష హెచ్ఐవీ ఎయిడ్స్ అవేర్‌నెస్ కార్యక్రమాన్ని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి ర్యాలీగా నిర్వహించారు. ఈ సందర్భంగా చైల్డ్ ఫండ్ ఇండియా సూపర్‌వైజర్ నిరోషా మాట్లాడుతూ.. తమ సంస్థ ద్వారా ఎయిడ్స్ సంపూర్ణ నియంత్రణకు పలు అవగాహన కార్యక్రమాలు చేపడుతూ.. హెచ్ఐవీ ఎయిడ్స్ రహిత సమాజం కోసం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం వసంత, గ్రామ కార్యదర్శి శంకర్, లింక్ వర్కర్స్ ఉపేందర్, మహేష్, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

వినోద	పరేషాన్
సాయిరాం	ట్రాన్స్‌ఫార్మర్స్
ఆదిత్య	బిచ్చగాడు 2
శ్రీనివాస	మేమ్ ఫేమస్
సుందర్	చక్రవ్యూహం

- ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	36	బచ్చలికూర	2
వంకాయ	36		10
బెండకాయ	34	పాలకూర	3
పచ్చిమిర్చి	60		10
కాకర	56	చుక్కకూర	2
సొరకాయ	26		10
బీర	50	తోటకూర	2
దొండ	38		10
పొట్లకాయ	40	గోంగూర	2
చిక్కుడు	70		10
గోరుచిక్కుడు	40	మెంతికూర	5
క్యాబేజీ	20		20
క్యాలీఫ్లవర్	24	కొత్తిమీర	1
ఆలుగడ్డ	24		15
చామగడ్డ	46	పుదీన	1
క్యారెట్	56		15
క్యాప్సికం	70	-ఖమ్మం వ్యవసాయం	

ట్రిపుల్ ఆర్‌తో సత్ఫలితాలు..!

నిరుపయోగ వస్తువుల సేకరణే లక్ష్యం

- కేఎంసీలో 36 కేంద్రాలు ఏర్పాటు
- ప్లాస్టిక్, పాత పుస్తకాలు, దుస్తులు, చెప్పులు సేకరణ
- ఇప్పటి వరకు 35.006 టన్నుల నిరుపయోగ వస్తువులు లభ్యం
- అధికారుల కృషితో పారిశుద్ధ్యం మెరుగు


ట్రిపుల్ ఆర్ కేంద్రాల్లో సేకరించిన వ్యర్థాలతో మేయర్ నారజ, కమిషనర్ ఆదర్శ్‌సురభి, తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగర పాలకసంస్థను స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దేందుకు కేఎంసీ అధికారులు చేపడుతున్న కార్యక్రమాలు మంచి ఫలితాలను ఇస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న పారిశుద్ధ్య కార్యక్రమాలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో నగరంలో పారిశుద్ధ్యం మెరుగుపడడంతో పాటు రోడ్ల వెంట వ్యర్థాలు కనబడడం లేదు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మేరి లైఫ్.. మేరీ స్వచ్ఛ షెహర్ పథకాన్ని ఖమ్మం నగర పాలక సంస్థలో మే 20వ తేదీ నుంచి ఈ నెల 5వ తేదీ వరకు నిర్వహించారు. డంపింగ్ యార్డ్‌కు వెళ్లే పొడి చెత్తను తగ్గించేందుకు ట్రిపుల్ ఆర్ విధానం తీసుకొచ్చి.. నిరుపయోగ వస్తువులను ప్రత్యేక కేంద్రాల ద్వారా సేకరించారు. కేఎంసీ పరిధిలో 17 రోజుల్లో 35.006 టన్నుల (నాలుగు రకాలు) వస్తువులను సేకరించారు.

36 కేంద్రాలు ఏర్పాటు..

పొడి చెత్తను ఎక్కడికక్కడే రెడ్యూస్(తగ్గించడం), రీయూజ్(తిరిగి ఉపయోగించడం), రీసైక్లింగ్(పునర్వినియోగం) చేయడమే ట్రిపుల్ ఆర్ విధానం. ఈ పద్ధతిపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు పొడి చెత్త సేకరణకు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ట్రిపుల్ ఆర్ విధానం అమలుకు ముందే నగరంలో పొడి వనుల సేకరణ కేంద్రాలు 19 ఉండగా.. వాటికి అదనంగా మరికొన్ని కేంద్రాలను ప్రారంభించి మొత్తం 36 కేంద్రాల ద్వారా ప్లాస్టిక్ వస్తువులు, పాత పుస్తకాలు, దుస్తులు, పాత చెప్పులు సేకరించారు. రెండు మూడు డివిజన్‌లకు కలిపి ఒక కేంద్రం ఏర్పాటు చేయడంతో ఆయా ప్రాంతాల్లోని ప్రజలు వారి వద్ద ఉన్న నిరుపయోగ వస్తువులను ఆ కేంద్రాల్లో అప్పగించారు. దీంతో రోజువారిగా చెత్త సేకరణ చేసే వాహనాలకు పొడి చెత్త కొంత మేర తగ్గింది.


పొడి వ్యర్థాలను సేకరిస్తున్న సిబ్బంది (ఫైల్)

సేకరించిన పొడి వ్యర్థాల వివరాలు (టన్నుల్లో)..

ప్లాస్టిక్ వస్తువులు	22.89
పాత పుస్తకాలు, పేపర్లు	7.14
పాత దుస్తులు	3.742
పాత చెప్పులు	1.244

మూడు వారాల్లోనే..

నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంతో పాటు డంపింగ్‌యార్డ్‌కు చెత్త తరలింపును తగ్గించేందుకు మూడు వారాల పాటు నిర్వహించిన కొత్త విధానం కేఎంసీలో సత్ఫలితాలను ఇచ్చిటన్లు అధికారులు పేర్కొంటున్నారు. కేఎంసీలో ఉన్న పొడి వనరుల సేకరణ కేంద్రాలకు నిరుపయోగ వస్తువులు వచ్చినప్పటికీ.. ట్రిపుల్ ఆర్ విధానంతో ప్రజలు నిరుపయోగ వస్తువులను కేంద్రాలకు బారిగా అందించారు. దీంతో ప్రజల్లో అవగాహన పెరగడం వల్ల ఇక నుంచి పొడి వనరుల కేంద్రాలు, స్వచ్ఛ ఆటోలకు ఈ వ్యర్థాలను అందజేస్తారని అధికారులు భావిస్తున్నారు.

అవగాహన కల్పించాం..

ట్రిపుల్ ఆర్ విధానంతో పొడి వ్యర్థాలను సేకరించాం. 36 కేంద్రాల ద్వారా 17 రోజుల పాటు పొడి వ్యర్థాలను సేకరించేందుకు ప్రజల్లో అవగాహన కల్పించాం. పొడి వనరుల కేంద్రం ద్వారా నిరంతర ప్లాస్టిక్, పాత పుస్తకాలు, దుస్తులు, చెప్పులు సేకరణ నిరంతరం కొనసాగుతోంది. ప్రజలు స్వచ్ఛ ఆటోలకు కూడా వీటిని అందించవచ్చు.

– మల్లీశ్వరి, అసిస్టెంట్ కమిషనర్, కేఎంసీ

జర్నలిస్టులకు కంటి వైద్యశిబిరం


కంటి వైద్య శిబిరంలో అధికారులు, ప్రజాప్రతినిధులు

ఖమ్మం సహకారనగర్: టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జర్నలిస్టు యూనియన్ ఖమ్మం నగర కమిటీ, ఖమ్మం ప్రెస్‌క్లబ్ కమిటీల ఆధ్వర్యాన జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ వారి సౌజన్యంతో బుధవారం ఖమ్మం జెడ్పీలో నిర్వహించిన కంటి వెలుగు వైద్య శిబిరం విజయవంతమైనట్లు యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.రాంనారాయణ తెలిపారు. తొలుత ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ బచ్చు విజయకుమార్, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం తదితరులతో కలిసి ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. జర్నలిస్టుల కోసం కంటి వైద్యశిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ మాలతి, డిప్యూటీ డీఎంహెచ్ఓ రాంబాబు, జర్నలిస్ట్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వనం వెంకటేశ్వర్లు, ఏనుగు వెంకటేశ్వరరావు, జర్నలిస్టులు గోగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మాటేటి వేణుగోపాల్, సామినేని మురారి, ఆవుల శ్రీనివాస్, ఖమ్మం నగర కమిటీ అధ్యక్షుడు మైసా పాపారావు తదితరులు పాల్గొన్నారు.

సర్దుబాటు ప్రక్రియను వాయిదా వేయాలి


కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఖమ్మం సహకారనగర్: ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియను తాత్కాలికంగా వాయిదా వేయాలని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.విజయ్ కోరారు. బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వీ.పీ. గౌతమ్‌కు వినతిపత్రం సమర్పించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో బడి బాట ద్వారా విద్యార్థుల ప్రవేశాలు జరుగుతున్న నేపథ్యాన సర్దుబాటును తాత్కాలికంగా నిలిపివేయాలని, కేజీబీవీ ఉపాధ్యాయులను రెన్యువల్ చేయాలని పేర్కొన్నారు. ఏప్రిల్, మే వేతనాలు కూడా చెల్లించడంతో పాటు ఇటీవల బదిలీ అయిన వారిని రిలీవ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రసాదరావు, వెంగళరావు, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

చెరుకు బిల్లులు చెల్లించండి సారూ..


ఎంపీ నామాకు విన్నవిస్తున్న చెరుకు రైతులు

నేలకొండపల్లి: మధుకాన్ షుగర్ ఫ్యాక్టరీకు చెరుకు సరఫరా చేసిన రైతుల బిల్లులు వెంటనే చెల్లించాలని మధుకాన్ పరిశ్రమల సంస్థ చైర్మన్, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావును చెరుకు రైతులు వేడుకున్నారు. నేలకొండపల్లి పర్యటనకు విచ్చేసిన ఆయనకు స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో బుధవారం వివిధ గ్రామాలకు చెందిన పలువురు రైతులు కలిశారు. గత మూడు నెలల నుంచి చెరుకు బిల్లులు రాకపోవడంతో వ్యవసాయం చేసుకునేందుకు డబ్బులు లేక నానా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో నామా ఫ్యాక్టరీలో కలవమని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రైతు ప్రతినిధులు మన్నె శ్రీనివాసరావు, పగిడికత్తుల రాములు, ఏ.గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

స్థల లబ్ధిదారుల జాబితాపై ఆగ్రహం..


తహసీల్దార్‌తో వాగ్వాదానికి దిగిన స్థానికులు

నేలకొండపల్లి: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా.. ఈ నెల 9న నిరుపేదలకు నివాస స్థలాలకు పట్టాలు ఇచ్చేందుకు రెవెన్యూ అధికారులు తయారు చేసిన జాబితా పట్ల నిరసనలు పెల్లుబికుతున్నాయి. మండలంలోని మోటాపురం పట్టాల లబ్ధిదారుల జాబితాలో రాజకీయ జోక్యం ఉందని, అర్హత లేని 31 మందిని ఎంపిక చేశారని బుధవారం మోటాపురం నిరుపేదలు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అధికారులు రాజకీయ నాయకుల సూచించిన విధంగా అర్హత లేని వారికి కేటాయించారని తహసీల్దార్ దారా ప్రసాద్‌ను ప్రశ్నించారు. 12, 6, 2, ఎకరాల రైతులకు కూడా నివాస స్థలం ఎంపిక చేశారని, గతంలో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకున్న వారిని, అర్హత లేని వారిని, రాజకీయంగా లబ్ధిదారులను ఎంపిక చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. లబ్ధిదారుల ఎంపికకు గ్రామ సభ నిర్వహించకుండా.. అధికారులు ఇష్టారాజ్యంగా జాబితాను సిద్ధం చేశారని మండిపడ్డారు. అనర్హత కలిగిన జాబితాను నిలిపివేసి అర్హత ఉన్న వారిని ఎంపిక చేయాలని, లేని పక్షంలో పట్టాల పంపిణీని అడ్డుకుంటామని హెచ్చరించారు. అధికారులు రాజకీయ నాయకులకు తలొగ్గకుండా.. పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో పేదలకు సంఘీభావంగా కాంగ్రెస్ పాలేరు నియోజకవర్గ కన్వీనర్ బచ్చలకూరి నాగరాజు, బొల్లినేని వెంకటేశ్వర్లు, బెల్లం వాసు, చావా కృష్ణమూర్తి, ఏలూరి సురేష్ తదితరులు పాల్గొన్నారు. అర్హత కలిగిన జాబితా కోసం గ్రామ సభను నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నిరుపేద బాధితులు పాల్గొనగా.. ఈ విషయంపై అర్హత లేని వారి జాబితా ఇస్తే విచారించి అనర్హత కలిగిన వారి పేర్లను తొలిగిస్తామని తహసీల్దార్ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

బాటసారులకు మజ్జిగ పంపిణీ


ఖమ్మంగాంధీచౌక్: ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకొని బుధవారం ఖమ్మం నగరంలోని త్రీటౌన్‌లో గల వర్తక సంఘం వద్ద చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో బాటసారులకు ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రధాన కార్యదర్శి మెంతుల శ్రీశైలం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు సోమా నర్సింహారావు, సహాయ కార్యదర్శి మన్నెం కృష్ణ, కోశాధికారి తల్లాడ రమేష్, ధాన్యం శాఖ అధ్యక్షుడు బొమ్మ రాజేశ్వరరావు, కార్యదర్శి మామిళ్లపల్లి రాంబాబు, జనరల్ కార్యవర్గ సభ్యులు బొమ్మ మధు, ప్రతినిధులు కైలాసపు వేణుగోపాల్‌రావు, పాయల నాగేశ్వరరావు, భవిరిశెట్టి మల్లికార్జున్‌రావు పాల్గొన్నారు.

గుడి పునఃనిర్మాణానికి విరాళం..


విరాళం అందిస్తున్న నర్సింహారావు దంపతులు

ఖమ్మంఅర్బన్: నగరంలోని 4వ డివిజన్ కైకొండాయిగూడెం క్రాస్ రోడ్డులోని శ్రీ అంకమ్మ, శ్రీ మహాలక్ష్మమ్మ, శ్రీ మద్దిరావమ్మ అమ్మవార్ల దేవాలయ పునఃనిర్మాణానికి ఖమ్మానికి చెందిన మలినేని నర్సింహారావు,మంగమ్మ దంపతులు విరాళం అందించారు. బుధవారం రూ.10,116ల విరాళంగా కమిటీ వారికి అందించగా.. రశీదు అందించి అభినందించారు.

సర్వజ్ఞ విద్యార్థికి అభినందన


విద్యార్థిని అభినందిస్తున్న డైరెక్టర్లు నాగేంద్రకుమార్, నీలిమ

ఖమ్మం సహకారనగర్: తమ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న విద్యార్థి బొల్లిన జిష్ణు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించాడని సర్వజ్ఞ పాఠశాల డైరెక్టర్లు ఆర్‌వీ నాగేంద్రకుమార్, నీలిమ తెలిపారు. బుధవారం విద్యార్థిని, తల్లిదండ్రులను అభినందించిన సందర్భంగా వారు మాట్లాడారు. జిష్ణు కళ్లకు గంతలు కట్టుకొని కీబోర్డుపై ఏకధాటిగా వాయించినందుకు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం లభించడంతో పాటు ప్రశంసా పత్రాన్ని అందుకున్నారని తెలిపారు. పిల్లల అభిరుచిని గుర్తించి వారిలో ఉండే సృజనాత్మకత, ప్రతిభను ప్రోత్సహించటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మానస, విద్యార్థి తల్లిదండ్రులు రామకృష్ణ, అనురాధ, బంధువులు నర్సింహారాజు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బొడ్రాయి, ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన


ధ్వజ స్తంభాన్ని ప్రతిష్టిస్తున్న భక్తులు

కూసుమంచి: మండలంలోని జుజుల్‌రావుపేట గ్రామ శివారు వాల్యాతండాలో నూతనంగా నిర్మించిన శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయంలో బుధవారం స్వామివార్ల విగ్రహ ప్రతిష్ఠతో పాటు ధ్వజస్తంభ, బొడ్రాయి ప్రతిష్ఠా మహోత్సవాలను వైభవంగా నిర్వహించారు. వేద పండితులు మంత్రోచ్ఛరణల మధ్య ఈ క్రతువును నిర్వహించగా.. గ్రామస్తులు, భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు.

10న మెగా లోక్ అదాలత్

ఖమ్మంరూరల్: ఈ నెల 10న మూడో అదనపు ఖమ్మం కోర్టులో మెగా లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఎస్సై వెంకటకృష్ణ బుధవారం తెలిపారు. కేసులు ఉన్నవారు రాజీ చేసుకోదలచిన వారు ఈ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. అందులో ప్రమాదం, ఘర్షణ, చీటింగ్, చిట్ ఫండ్, భూతగాదాలు, వివాహ బంధానికి సంబంధించిన కేసులు పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు.

ఇచ్చిన హామీలు అమలు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న బందెల వెంకయ్య

తిరుమలాయపాలెం: బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చిన దళితులకు మూడెకరాల భూమి పథకాన్ని వెంటనే అమలు చేయాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శివలింగం, బందెల వెంకయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని పిండిప్రోలులో జరిగిన మండల స్థాయి కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. కేసీఆర్ పాలనలో అవినీతి, భూ కబ్జాలు మరింతగా పెరిగిపోయాయని, బడా పెట్టుబడిదారులకు ప్రభుత్వ భూములను దారాదత్తం చేస్తుందని ఆరోపించారు. ప్రభుత్వ విద్య, వైద్య రంగాలను దెబ్బతీస్తుందని అన్నారు. గిరిజనులు సాగుచేసుకుంటున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, ఉద్యోగాలు భర్తీ చేయాలని, పేదలకు ఇళ్లతో పాటు ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు, పెన్షన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి సోమనపల్లి వెంకటేశ్వర్లు మండల నాయకులు కలపాల జయమ్మ, ఉప్పలయ్య, కొత్తపల్లి శివ, భిక్షం తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే అత్యాచారాలు

ఖమ్మంమయూరిసెంటర్: ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా మహిళలు, చిన్నారులపై అత్యాచారాలు పెరుగుతున్నాయని పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి జానకి, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.మస్తాన్ అన్నారు. బుధవారం నగరంలోని లెనిన్‌నగర్‌లో ఏర్పాటు చేసిన సంఘాల ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. ఖమ్మంరూరల్ మండలం ఎదులపురంలో పెట్రోల్ బంక్ సమీపంలో నివాసముంటున్న చిన్నారిపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలన్నారు. మహిళల రక్షణ కోసం కొత్త చట్టాలు తీసుకొస్తున్నా.. వాటిని పకడ్బందీగా అమలు చేయకపోవడంతోనే నేరాలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. తల్లిదండ్రులు రోడ్డు ఎక్కి ప్రజలతో కలిసి ఆందోళన చేసే వరకూ పోలీసులు, వైద్యులు బాధిత చిన్నారిని పట్టించుకునే పరిస్థితి లేకుండా పోయిందని, ప్రభుత్వాల వైఖరితోనే మహిళలకు రక్షణ లేకుండా పోయిందని తెలిపారు. ఈ సమావేశంలో సాగర్, ఆర్‌కె.రవికుమార్, శ్రావ్య తదితరులు పాల్గొన్నారు.

ముగింపు సభను జయప్రదం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న జావీద్

ఖమ్మం సహకారనగర్/నేలకొండపల్లి: సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్ యాత్ర ముగింపు సభను జయప్రదం చేయాలని కాంగ్రెస్ నగర అధ్యక్షుడు మహ్మద్ జావీద్ కోరారు. ఖమ్మంలోని కాంగ్రెస్ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. ముగింపు సభకు ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ తదితర నేతలు హాజరు కానున్నందున పార్టీ శ్రేణులు తరలివచ్చి జయప్రదం చేయాలన్నారు.అలాగే నేలకొండపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొందయ్య మాట్లాడుతూ.. ఈ నెల 25న ఖమ్మంలో ముగింపు సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రుణ దరఖాస్తులకు పరిష్కార మార్గం చూపకుండా.. ఇప్పుడు రూ.లక్ష ఆర్థిక సాయమంటూ కొత్త మోసానికి తెరలేపారని విమర్శించారు. ప్రభుత్వానికి నిజంగా బీసీలపై చిత్తశుద్ధి ఉంటే అందరికీ రుణసాయం అందించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నేలకొండపల్లి సర్పంచ్ రాయపూడి నవీన్, నాయకులు, కార్పొరేటర్లు సైదులునాయక్, వెంకటేశ్వర్లు, బాణాల లక్ష్మణ్, బాలాజీనాయక్, కొప్పెర ఉపేందర్, పల్లెబోయిన జంగం లక్ష్మీనారాయణ, కొండలు, భారతీచంద్రం, సరిత ఉపేందర్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి


వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ ఆందోళనకు దిగిన బంధువులు

ఖమ్మం వైద్యవిభాగం: జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందగా.. వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ బంధువులు ఆందోళనకు దిగిన ఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.... ఖమ్మం రూరల్ మండలం నర్సింహాపురం గ్రామానికి చెందిన కె.శ్రీనివాస్(35) అనారోగ్యంతో మంగళవారం వైరా రోడ్డులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరారు. చికిత్స అందిస్తున్న క్రమంలోనే బుధవారం రాత్రి ఆయన మృతి చెందగా విషయం తెలుసుకున్న బంధువులు చేరుకొని ఆందోళనకు దిగారు. వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే శ్రీనివాస్ మృతి చెందాడని వైద్యులు, సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. దీంతో ఖమ్మం టూటౌన్ సీఐ శ్రీధర్ సిబ్బందితో చేరుకొని పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ మృతుడి బంధువులు వినకపోవడంతో ఉద్రిక్తత నెలకొంది. ఫిర్యాదు చేస్తే విచారణ చేసి చట్టప్రకారం చర్యలు తీసుకుంటానని సీఐ హామీ ఇవ్వడంతో వారు శాంతించారు. ఈ విషయమై ఆస్పత్రి యాజమాన్యాన్ని వివరణ కోరగా చికిత్స అందించడంలో తమ తప్పేమీ లేదని తెలిపారు. ప్యాంక్రియాసిస్ సమస్యతో తమ వద్దకు శ్రీనివాస్‌ను తీసుకొచ్చే సరికే పరిస్థితి విషమంగా ఉందని, చికిత్స అందించే క్రమంలో తినడానికి ఏమీ ఇవ్వొద్దని సూచించినా కుటుంబ సభ్యులు తినిపించడంతో పరిస్థితి విషమంగా మారి మృతి చెందాడని పేర్కొన్నారు.

భవన నిర్మాణ కార్మికుడు..

ఖమ్మంక్రైం: భవన నిర్మాణ పనులు చేస్తూ కింద పడి తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. తిరుమలాయపాలెం మండలం బచ్చోడు తండాకు చెందిన ధరావత్ దూబ్లో(47) కూలీ పనులు చేస్తున్నాడు. ఖమ్మంలో బోనకల్ క్రాస్‌లోని భవన నిర్మాణ పనులకు ఈనెల 1న వచ్చిన ఆయన ప్రమాదవశాత్తు జారి పడగా తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆస్పత్రిలో చికిత్స చేయిస్తుండగా బుధవారం మృతి చెందడంతో ఖమ్మం వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

‘ఉపాధి’ వద్ద సౌకర్యాలు అవసరం


తిరుమలాయపాలెం: కాకరవాయిలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న నాయకులు

నేలకొండపల్లి/తిరుమలాయపాలెం/ఖమ్మంరూరల్: ఉపాధి హామీ పథకం పని చేసే చోట కనీస సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందని బీఎస్పీ పాలేరు ఇన్‌చార్జ్ వెంకటేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి నర్సయ్య, అఖిల భారత ప్రగతిశీల కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బందెల వెంకయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నేలకొండపల్లి మండలంలోని చెన్నారంలో ఉపాధి హామీ పథకం కూలీలతో నిర్వహించిన సమావేశంలో వెంకటేశ్వరరావు, తిరుమలాయపాలెం మండలం కొకరవాయి గ్రామంలో ఉపాధి పనులను పరిశీలించిన సందర్భంగా నర్సయ్య, ఖమ్మంరూరల్ మండలం ఎం.వెంకటాయపాలెంలో ఉపాధి పనులు జరిగే చోట వెంకయ్య మాట్లాడారు. ఉపాధి కూలీలకు కనీస వేతనం కింద రోజుకు రూ.600 చెల్లించి ఆదుకోవాలని, వడదెబ్బ, ఇతరత్రా కారణాల మృతి చెందితే వారి కుటుంబాలకు రూ. 20లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, టెంట్ సౌకర్యం, మంచినీటి వసతి, ప్రాథమిక వైద్యపరమైన కిట్లు అందుబాటులో ఉంచాలని, ఏడాదిలో రూ.2, 500 పనిదినాలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. కూలీలు తమ హక్కుల కోసం పోరాటాలు సాగించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఈ కార్యక్రమాల్లో మండల కన్వీనర్ తోళ్ల వీరస్వామి, నాయకులు కొత్తపల్లి వెంకన్న, గుండాల వెంకన్న, వీరబోయిన నాగయ్య, ఆర్.యాదగిరి, బాలిన నాగేశ్వరరావు, లలిత, కె.సత్యవతి, వెంకటప్పారావు, ఏ.వెంకన్న, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.